


పంచాయతీల అభివృద్ధిపై సమావేశం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పంచాయతీలలో 2022- 23 సంవత్సరంలో జరిగిన అభివృద్ధి పనులపై మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ భవనం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. 2022-23 సంవత్సరంలో పంచాయతీలలో జరిగిన అభివృద్ధిపై అక్టోబర్ 15వ తేదీ నాటికి ప్రభుత్వానికి నివేదిక తయారు చేసి పంపాలని, అందుకు అనుగుణంగా అధికారులు పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి నివేదిక తయారు చేయాలని ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ నవీన్ కుమార్, హెచ్ఓ నవీన్ కుమార్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మడకశిరలో వర్షం లేక ఎండిపోయిన వేరుశనగ పంట



- తీవ్ర వర్షాభావంతో చేతికందని పంట
- గతరెండేళ్లు అతివృష్టితో నష్టం
- అప్పల ఊబిలో అన్నదాతలు

రైతుల ఆశలు ఆవిరి,,!

ప్రజాశక్తి-మడకశిర

అతివృష్టి, అనావృష్టి గత ఐదేళ్లుగా రైతులను వ్యవసాయం నష్టాల ఊబిలోకి నెట్టేస్తోంది. మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా వ్యవసాయం ఆధారపడి ఎక్కువ మంది జీవనం సాగిస్తుంటారు. గత రెండేళ్లు అతివష్టితో నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పంటలను నష్టపోయారు. సాగుకు ఖర్చు చేసిన పెట్టుబడులు కూడా చేతికందలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి అయినా తమ ఆశలు పండుతాయి అని ఎన్నో ఆశలతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధం అయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచే వర్షాలు సరిగా రాలేదు. అరకొర వచ్చిన వర్షానికి విత్తనం వేసినా వర్షాభావంతో అది కూడా ఎండిపోతోంది. పశువులకు కూడా మేతదొరకని పరిస్థితి నెలకొంది. మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో వేరుశనగ, మొక్కజొన్న, రాగులు, కందులు సాగు చేశారు. మడకశిర మండలంలో 18,464 హెక్టార్లలో వేరుశనగ, 264 హెక్టార్లలో మొక్కజొన్న, 163 హెక్టార్లలో రాగులు, 124 హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. రొళ్ల మండలంలో 4002 హెక్టార్లలో వేరుశనగ, 300 హెక్టార్లలో మొక్కజొన్న, 350 హెక్టార్లలో రాగులు, 255, హెక్టార్లలో కందులు సాగు చేశారు. గుడిబండ మండలంలో 4600 హెక్టార్లలో వేరుశనగ, 480 హెక్టార్లలో మొక్కజొన్న, 800 హెక్టార్లలో రాగులు, 510 హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. అమరాపురం మండలంలో 2170 హెక్టార్లలో వేరుశనగ, నాలుగు హెక్టార్లలో మొక్కజొన్న, 112 హెక్టార్లలో రాగులు, 50 హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. ఆగళి మండలంలో 3258 హెక్టార్లలో వేరుశనగ, 290 హెక్టార్లలో మొక్కజొన్న, 692 హెక్టార్లలో రాగులు, 155 హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. గత సంవత్సరంలో 33,770 హెక్టార్లలో వేరుశనగ పంటను సాగు చేయగా, ఈసారి 15,876 హెక్టార్లలో మాత్రమే సాగు అయ్యింది. పంట వేసినప్పటి నుంచి ఇప్పటివరకు అడపాదడపా వర్షాలు వచ్చాయి తప్పా, ఆశించన స్థాయిలో వర్షాలు రాలేదు. వర్షాలు లేక సాగు చేసిన అరకొర పంట కూడా ఎండుదశకు చేరుకుంది. ప్రతిసారీ ఏదో ఒక రూపంలో నష్టాలు తప్పా, ఎలాంటి లాభాలు తాము కళ్లచూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు లేకపోవడంతో మడకశిర నియోజక వర్గంలో ఇటీవల వలసలు అధికం అయ్యాయి. రైతు కుటుంబాలు ఇక్కడి నుంచి బెంగుళూరు లాంటి నగరాలకు వలస వెళ్లి కూలి పనులు చేసుకంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునే చర్యలను చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పేదలపై ఎందుకింత నిర్లక్ష్యం..?



చిలమత్తూరులో పేదల ఇళ్ల స్థలాల సమస్యను జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వివరిస్తున్న సిపిఎం నాయకులు

- చిలమత్తూరు పేదలకు ఇళ్ల పట్టాలివ్వాల్సిందే..
- పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన
- ఇన్‌ఛార్జి జెసి కారు ముందు బైటాయించి నిరసన

ప్రజాశక్తి-పెనుకొండ

ఇళ్ల స్థలాలు లేని వారికి పట్టాలు ఇవ్వాలని మూడేళ్లుగా కోరుతున్నా పట్టించుకోకుండా పేదలపై ఎందుకింత నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని సిపిఎం, వ్యకాసం నాయకులు అధికారులను నిలదీశారు. చిలమత్తూరులో ఇళ్ల పట్టాలు లేని పేదల సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో పేదలు ఆందోళన చేపట్టారు. ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్ కారుకు అడ్డంగా కూర్చొని నిరసన తెలిపారు. తమ సమస్యకు పరిష్కారం చూపేందుకు అక్కడి నుంచి లేచేది లేదని తెగేసి చెప్పారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ చిలమత్తూరు గ్రామానికి చెందిన ఇళ్లు లేని నిరుపేదలు 260 మందిని అధికారులు గుర్తించారన్నారు. వీరితో పాటు మరికొందరకు కూడా ఇళ్ల స్థలాల కోసం అధికారులకు అర్జీలు అందజేశారన్నారు. వీరికి ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా అధికారులు అనేక మోసపూరిత హామీలు ఇచ్చారన్నారు. అధికారులపై నమ్మకం లేక సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో గత 20 రోజుల క్రితం భూస్వాధీన ఉద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆ సమయంలో కూడా ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ అధికారులు హామీ ఇచ్చారన్నారు. హామీ ఇచ్చినట్టే ఇచ్చి పేదలు వేసుకున్న గుడిసెలను ఉన్న ఫలంగా రెవెన్యూ అధికారులు తొలగించారన్నారు. గుడిసెలకు నిప్పుకూడా పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెల్లో ఉన్న విలువైన పత్రాలను కాలిపోయాయన్నారు. ఒక్కొక్కరికి రూ.20 వేల వరకు నష్టం వచ్చిందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు సోమవారం రావాలంటూ చిలమత్తూరు రెవెన్యూ అధికారులు పేదలు, సిపిఎం నాయకులకు చెప్పారన్నారు. కార్యాలయానికి రమ్మని చెప్పి అధికారులు ఎవరూ పేదలతో చర్చించకుండా అవమానించడం సరికాదన్నారు. తక్షణం పేదల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పేదల ఆందోళనకు స్పందించి ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ వారితో మాట్లాడారు. నెల రోజుల్లో ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాన్ని పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారు. ఆయన హామీతో పేదలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో చిలమత్తూరు సిపిఎం నాయకులు వెంకటేశులు, లక్ష్మీనారాయణ, పెనుకొండ సిపిఎం నాయకులు రమేష్, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, పేదలు పాల్గొన్నారు.



సానిపల్లిలో బోరు వేయిస్తున్న సర్పంచి పరమేష్

సానిపల్లిలో తాగునీటి సమస్యకు పరిష్కారం

రొద్దం : మండల పరిధిలోని సానిపల్లి పంచాయతీలో నెలకొన్న నీటి సమస్యకు సర్పంచి పరమేష్ పరిష్కారం చూ పారు. గ్రామంలో నీటి సమస్య నెలకొందని స్థానికులు సర్పంచికి తెలిపారు. ఈ విషయాన్ని సర్పంచి పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఎమ్మెల్యే సాయం చేయడంతో సర్పంచి బోరు వేయించారు. దీంతో గ్రామంలో నీటి సమస్య తీరినట్లు గ్రామస్తులు తెలిపారు.

విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యుఐ కృషి

మడకశిర : జిల్లా వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో పోరాలు చేస్తామని ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు. ఎన్ఎస్‌యుఐ నాయకులు సోమవారం పట్టణంలోని ఎస్‌వి డిగ్రీ కళాశాలలో పర్యటించి విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి నియోజకవర్గంలో కళాశాలలకు వెళ్లి విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా విని, తెలుసుకొని సాధన దిశగా ఎన్ఎస్‌యుఐ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అజయ్‌కుమార్, ఉపేంద్ర, విష్ణు, నంద, పాల్గొన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పండి


బత్తలపల్లి : విద్యార్థి దశ నుంచి పిల్లలకు నైతిక విలువలను నేర్పించాలని బత్తలపల్లి ఎస్ఐ పి. శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా పోలీసులు ఏర్పాటు చేసిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుణాత్మకమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు పంచతంత్రం, బాలమిత్ర తదితర విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదవాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థినులకు ప్రశ్నలు వేసి, పఠనా నైపుణ్యం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయంతి, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

దళిత రైతు మృతిపై అనుమానాలు

సమగ్ర విచారణకు సిపిఎం, దళిత సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-హిందూపురం

ఆదివారం లేపాక్షి మండలం కొండూరు రెవెన్యూ పొలంలోని కుశలవ అనే సంస్థ అన్యాక్రాంతం చేసుకున్న తన భూమిలోనే చిలమత్తూరు మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన దళిత యువరైతు వెంకటేష్ చేసుకున్న ఆత్మహత్య అనుమానస్పదంగా ఉందని సిపిఎం, దళిత సంఘం నాయకులు అనుమానం వ్యక్తం చేశారు. కొర్లకుంట గ్రామంలోని శ్మశాన వాటికలో వెంకటేష్ అంత్యక్రియలు జరుగుతునన్న విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, వ్యకాసం జిల్లా ప్రదాన కార్యదర్శి పెద్దన్న, అధ్యక్షుడు ప్రవీణ్, ఎంఆర్‌పిఎస్ లాయర్స్ యూనియన్ నాయకులు రవి, కెవిపిఎస్ జిల్లా నాయకులు హనుమయ్య శ్మశాన వాటిక వద్దకు చేరుకొన్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ లేపాక్షి పోలీస్ జమేదార్ యువకుని మృతదేహం పోస్టుమర్టం మీద ప్రత్యేక శ్రద్ధ చూపారని అన్నారు. యువకుడి భార్యతో బలవంతంగా కేసును బలహీనం చేయడానికి రాయించుకున్నారని విమర్శించారు. దీనిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. అదేవిధంగా ఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మృతదేహాన్నిఖననం చేసే సమయంలో ఆ స్థలంలో పోలీసులు ఉండటం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఇవన్నీ చూసిన తర్వాత మృతదేహాన్ని రీ పోస్ట్‌మార్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కుశలవ సంస్థపై కేసు నమోదు చేయాలని డిమెండ్ చేశారు. అదే విధంగా మృతుని కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని, కుశలవ ఆక్రమించిన భూములను తిరిగి దళిత కుటుంబాలకు ఇవ్వాల ని డిమాండ్ చేశారు. రెవెన్యూ, పోలీసు అధికారులు రావాలని డిమాండ్ చేస్తు మృతదేహాన్ని ఖననం చేయకుండా అక్కడే ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ కంజాక్షన్, రూరల్ సిఐ వేణుగోపాల్, లేపాక్షి, చిలమత్తూరు తహశీల్దార్లు కె, బాబు, నాగరాజులతో పాటు ఎస్ఐ గంగాధర్ అక్కడికి చేరుకున్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడంతో పాటు నష్ట పరిహారం ఇవ్వాలని, తక్షిణ సహాయం కింద రూ.25వేలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ అధికారులు, రెవెన్యూ అదికారులు మాట్లాడుతూ బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కుశలవ మీద న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, నారాయణ, రాయుడు, వేణు గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్మశాన వాటికలో అధికారులకు సమస్యను వివరిస్తున్న సిపిఎం నాయకులు

క్యాంపురంలో ప్రబలిన విషజ్వరాలు.. ఒకరి మృతి

పడకేసిన పారిశుద్ధ్యం.. పత్తాలేని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న రోగులు

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండల పరిధిలోని మారుమూల గ్రామమైన క్యాంపురంలో విషజ్వరాలు ప్రబలాయి. ఇప్పటికే విషజ్వరంతో బాధపడుతున్న రామచంద్ర సోమవారం మృతి చెందగా పదుల సంఖ్యలో మంచం పట్టారు. గ్రామంలో ఎవరి ఇంటి తలుపు తట్టినా ముక్కుతూ, మూలుగుతూ మంచం పట్టిన దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. గ్రామంలో దాదాపు వంద కుటుంబాలు ఉండగా ప్రతి ఇంటిలో ఇద్దరు, ముగ్గరు జ్వరాలతో మంచం పట్టారంటే పరిస్థితి ఎలా ఉందో అర్ధమవుతుంది. గ్రామంలో ప్రధాన రోడ్లపైనే మురుగునీరు నిల్వ ఉండడంతో ఈగలు, దోమలకు ఆవాసాలుగా మారాయి. అక్కడక్కడ డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేసినా చెత్త చెదారం పేరుకుపోవడంతో మురుగునీరు బయటికి వెళ్లే మార్గం లేక ఎక్కడికక్కడ రోడ్డుపైకి చేరుతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు జ్వరాల బారిన పడినా వైద్య ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది చుట్టపు చూపుగానైనా గ్రామంవైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికే గ్రామంలో గంగాధర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రత్నమ్మ, హరీష్, మల్లేష్ , గంగరాజు, నరసింహప్ప, రఘురాం, హనుమంత రాజు, గోవిందప్ప, వెంకటరమణప్ప, రామకృష్ణప్ప, తదితరుల ఇళ్లల్లో జ్వరంతో పలువురు బాధపడుతున్నారు. గ్రామంలో రెక్కాడితేనే కానీ డొక్కాడని బడుగులే అధికంగా ఉన్నారని, విషజ్వరాలు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా వైద్య సిబ్బంది స్పందించక పోవడంతో విధి లేని పరిస్థితుల్లో అప్పులు చేసి ప్రయివేట్ ఆసుపత్రలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నామని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



జ్వరంతో మృతిచెందిన రామచంద్ర



చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

చేగువేరాకు నివాళి

పెనుకొండ : పట్టణంలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం చేగువేరా వర్ధంతి సభ నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు హరి మాట్లాడుతూ చేగువేరా అమెరికా చేసిన అరాచకాలపై క్యూబా ప్రజలను చైతన్యవంతులను చేసి పోరాటాలు చేసిన తీరు, చేగువేరా సమాజానికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, సిపిఎం సభ్యులు తిప్పన్న, వెంకటేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాంపులో 'పురం' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

ఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మకమైన ఆలిండియా తల్ సైనిక్ ఎన్సీసీ క్యాంపులో హిందూపురం పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాలకు చెందిన విద్యార్థిని బి. మేఘన ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు సోమవారం స్థానిక కళాశాలలో విద్యార్థినిని కళాశాల కమిటీ సభ్యులు, ప్రిన్సిపల్, తోటి విద్యార్థులు అభినందించారు. అనంతరం సన్మానించి నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి బైసాని రామ్ ప్రసాద్, కళాశాల కమిటీ వైస్ ప్రెసిడెంట్ దాసా సురేష్, నందకిశోర్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఉపయోగం

జిల్లా ప్రత్యేక అధికారి కెవిఎన్.చక్రధర్ బాబు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ప్రభుత్వం నిర్వహిస్తున్న జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతో ఉపయోగకరమైనది, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని జగనన్నకు చెబుదాం, జిల్లా ప్రత్యేక అధికారి, ఏపీ జెన్కో ఎండి కెవిఎన్.చక్రధర్ బాబు తెలిపారు. సోమందేపల్లిలో జరుగుతున్న జగన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి సోమవారం పరిశీలించారు. సోమందపల్లి ఎంపిపి పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమం పేదలకు గొప్ప వరం లాంటిదని చెప్పారు. ప్రతి పేదవాడికీ వైద్యాన్ని వారి గడపవద్దకు చేర్చేందుకు ప్రభుత్వం దీనిని అమల్లోకి తెచ్చిందన్నారు. వాలంటీర్లు, ఎఎన్ఎంలు, గృహసారథులు గత 15 రోజుల నుండి ప్రతి గడపకు వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటున్నారని చెప్పారు. ఇంటి వద్దనే బిసి, షుగర్ పరీక్షలు చేస్తున్నారన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో చాలామంది ప్రజలు ఆరోగ్య విషయంలో శ్రద్ధను చూపించలేకపోవడం వల్ల అనారోగ్యానికి గురై ఇబ్బందులు లోనవుతున్నారన్నారు. దీనిని అధికమించడానికి ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లతో సర్వేచేయించి 7 రకాల వైద్య పరీక్షలతో వారి వ్యాధిని గుర్తించి ప్రత్యేకమైన యాప్‌లో డౌన్‌లోడ్ చేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రత్యేకమైన డాక్టర్లతో వైద్య సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండల పరిధిలోని చాకర్లపల్లి హౌసింగ్ లేఅవుట్, మాగేచెరువు గ్రామ సచివాలయం భవన నిర్మాణం పనులను పరిశీలించారు. సోమందేపల్లి జిఎస్ కాలనీ ఎంపిపి పాఠశాల జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్, జిల్లా వైద్య శాఖ అధికారి ఎస్‌వి.కృష్ణారెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డిఇఒ మీనా, ఎంపిపి గంగమ్మ, సర్పంచి గంగాదేవి, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ మంజులా దేవి, తహశీల్దార్ సురేష్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జగన్న సురక్షకార్యక్రమంలో చికిత్సలు చేయించుకునేందుకు వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి కెవిఎన్.చక్రధర్ బాబు

వైసిపి పాలన అస్తవ్యస్తం

టిడిపి కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక అస్తవ్యస్త పాలన కొనసాగుతోందని, దీని వల్ల అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బందుకలు గురవుతున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ కదిరి పట్టణంలో చేపట్టిన నిరసన దీక్షలో కొనసాగుతున్నాయి. సోమవారం నాడు బలిజ సంఘం నాయకులు రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును రాజకీయ కక్షతోనే అక్రమ కేసుల్లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇరికించిందన్నారు. వైసిపి అనాలోచిత విధానాలతో ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. బలిజ కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడి ఉన్నారన్నారు. వైసిపి ప్రభుత్వం బలిజలకు ఎలాంటి సాయం అందించడం లేదన్నారు. గతంలో టిడిపి హయాంలో కాపు కార్పొరేషన్ ద్వారా ఎంతోమందికి సబ్సిడీ రుణాల మంజూరు చేశామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక వాటిని తుంగలో తొక్కిందని విమర్శించారు. కదిరి నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న బలిజ కులస్తుల కోసం కళ్యాణ మండపాన్ని కట్టిస్తానని కందికుంట హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ బలిజ కులస్తులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కదిరిలో బలిజ కులస్తులతో కలిసి నిరసన ర్యాలీ చేస్తున్న కందికుంట వెంకటప్రసాద్

యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన

మడకశిర : పట్టణంలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం యాంటీ ర్యాగింగ్‌పై పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ లోకేష్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో కష్ట పడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ర్యాగింగ్ చేయడం, ఇతరుల మనోభావాలు, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం చట్టరీత్యా నేరమని, అలాచేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఒకసారి కేసు నమోదైతే ఆ విద్యార్థి భవిష్యత్తుకు చాలా ఇబ్బందిగా వుంటుందని హెచ్చరించారు. జీవితాలను చిన్నాభిన్నం చేసే చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో సన్మార్గంలో పయనించాలని హితవు పలికారు. అనంతరం ఎస్ఐని ప్రిన్సిపల్ నారాయణరెడ్డి శాలువాతో సన్మానించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ లోకేష్

పోషకాహార పదార్థాల ప్రదర్శన

ప్రజాశక్తి-లేపాక్షి

మండల పరిధిలోని కొండూరు పంచాయతీలో సోమవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సిడిపిఓ రెడ్డి రమణమ్మ, ఎంపిడిఓ నరసింహనాయుడు, ప్రత్యేకాధికారి సుదర్శన్‌బాబు, ఇఒఆర్‌డి శివన్న, పంచాయతీ కార్యదర్శులు నాగేంద్ర, రమేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్



వృద్ధురాలితో అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్

జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు పరిష్కరించాలంటూ కార్యాలయాలకు వస్తారని వారి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని సమస్యల పరిష్కారమే ముఖ్య లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులతో కలెక్టర్ అర్జీలు స్వీకరించడమే గాక సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సమస్య ఎక్కడ ఉందో క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు పరిష్కరించినప్పుడే జిల్లా యంత్రాంగం మీద ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. మండల, డివిజన్ కార్యాలయాల్లో కూడా వచ్చే అర్జీలను పరిష్కరించినట్లయితే ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓర్చి కలెక్టరేట్‌కు రారన్నారు. ఎక్కడికి అక్కడ పరిష్కారానికి ఆయా అధికారులు చర్యలు తీసుకోవాలని రెండవసారి అర్జీదారులు రాకుండా సమస్య పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిఎల్‌డిఒ శివారెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి జానపద నృత్య పోటీలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

కమిషనర్ ఆఫ్ స్కూల్ ఉత్తర్వుల మేరకు జనాభా విద్యలో భాగంగా నిర్వహించే జిల్లాస్థాయి జానపద, నాటకీకరణ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జిల్లా విద్య శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 11, 12 వ తేదీలలో జిల్లా విద్య శిక్షణ కేంద్రంలో ఉమ్మడి జిల్లా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 94409 44707, 9441823923, 9441144246 నంబర్లను సంప్రదించాలని కోరారు.

టిడిపి నిరసనలో ఉద్రిక్తత

నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-హిందూపురం



పోలీసులతో నాయకుల వాగ్వాదం

టిడిపి అధినేత చంద్రబాబునాయుడి అరెస్టుకు నిరసనగా సోమవారం పట్టణంలో కురుబ సామాజిక వర్గ నేతలు వారి సాంప్రదాయ పద్ధతిలో గొరవయ్యల వేషధారణతో ర్యాలీ చేపట్టారు. అందుకు ఆగ్రహించిన పోలీసులు రోడ్డుమీదకు వచ్చి అడ్డుకుని ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. దీంతో కురుబలు చేపట్టిన ర్యాలీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బాలకృష్ణన్ కూడలి నుంచి ర్యాలీగా బయలు దేరిన కురుబలు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని కనకదాసు విగ్రహం వద్దకు చేరుకోబోతుండగా వన్ టౌన్ సిఐ శ్రీనివాసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి హిందూపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ సిఐతో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. అంబికాతో పాటు మరో 10 మంది ముఖ్య నేతలను అరెస్టు చేసి వన్ టౌన్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తు వన్ టౌన్ స్టేషన్‌ను ముట్టడించటంతో ఉద్రిక్తతకు దారితీసింది. అంబికా లక్ష్మీనారాయణను విడుదలచేయాలని నినాదాలు చేశారు. సిఐతో న్యాయవాది శివశంకర్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొలకుంట అంజనప్ప పట్టణ పార్టీ అధ్యక్షులు డీఈ రమేష్ కుమార్, పార్టీ నాయకులు చర్చలు జరిపారు. అంబికా లక్ష్మీనారాయణను వదిలివేయటానికి సమ్మతించటంతో సంఘటన సుఖాంతమైంది. దీనికన్న ముందు దీక్షా శిబిరంలో జరిగిన దీక్షలో పార్లమెంట్ అధ్యక్షులు పార్థసారథి పాల్గొన్నారు. అనంతరం కురువలు, నాయకులు చెవులో పూలు పెట్టుకుని నోటికి రిబ్బన్ కట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఐటిడిపి పార్లమెంట్ అధ్యక్షులు కురుబ రామాంజనేయులు, రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి పరిమళ, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మాలక్క, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు అభి, నాయకులు కురుబ కిష్టప్ప, కమటం వెంకటేష్, నాగరాజు, కొల్లకుంట అనిల్, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇరువర్గాల ఘర్షణ
అడ్డుకోబోయిన వ్యక్తికి రాయితగిలి మృతి

ముదిగుబ్బ : ఇరు వర్గాల మధ్య నెలకొన్న ఘర్షణను సర్దిచెప్పేందుకు వెళ్లిన వ్యక్తిపై దాడి జరగడంతో ఆయన తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఈ ఘటన సోమవారం రాత్రి ముదిగుబ్బ మండలం సిరిగారిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... సిరిగారిపల్లి గ్రామంలో రెండు వర్గాల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ మొదలైంది. ఒకరిపై ఒకరు రాళ్లదాడి చేసుకున్నారు. ఈ సమయంలో అక్కడ ఉన్న కోన బాలాద్రి(55) వారికి సర్దిచెప్పేందుకు వెళ్లారు. ఘర్షణ సమయంలో ఇతనిపై బలంగా రాయివిసరడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మరణించాడు. ఘటనా స్థలాన్ని ముదిగుబ్బ సిఐ యతీంద్ర, ఎస్ఐ వంశీ కృష్ణ, ఇసాకాలు పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోరంట్ల రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి గోరంట్లలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని గుంతపల్లి గ్రామానికి చెందిన గొల్ల కాపర బోయ సురేష్(38) ద్విచక్ర వాహనంపై గోరంట్లకు వస్తుండగా కొత్తచెరువు రోడ్డులోని గుమ్మయ్యగారి పల్లి మలుపు దాటగానే ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో అదుపు తప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య అరుణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు..

మిద్దె పైనుంచి పడి వ్యక్తికి గాయాలు

చిలమత్తూరు : దేమకేతేపల్లి పంచాయతీ కేంద్రంలో ఓ ఇంటికి వైరింగ్ పని చేయడానికి వెల్లిన చిలమత్తూరుకి చెందిన జబీ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి మిద్దెపై నుండి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం అవడంతో చిలమత్తూరు ఆసుపత్రికి అక్కడి నుంచి బాగేపల్లికి తరలించారు.

పేకాట జూదరులు అరెస్టు

ఓబుళదేవరచెరువు : . మండల కేంద్రానికి సమీపంలోనిచెరువు కట్ట కింద కంపచెట్లలో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. తమకు అందించిన సమాచారం మేరకు ఎఎస్ఐ రమణ రెడ్డి, సిబ్బంది ప్రతాప్, నరేష్, లోకేష్, కోలా ఆంజనేయులుతో కలసి దాడులు నిర్వహించామన్నారు. ఈసందర్భంగా 10మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.10020లు, పేకముక్కలు, 8 మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పట్టణంలో చోరీ

కదిరి అర్బన్ : పట్టణ పరిధిలోని వలిసాబ్ రోడ్డులోని ఓ ఇంటిలో చోరీ జరిగింది. సిఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు... వలీసాబ్ రోడ్డులో నివాసం ఉన్న ఇమ్రాన్‌బీ తన భర్త ఆసిఫ్ అలీ ఖాన్‌తో కలసి వ్యక్తిగత పనుల మీద ధర్మవరానికి వెళ్లారు. గమనించిన దుండగులు వారి ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. చోరీ జరిగిన విషయం గమనించిన చుట్టుపక్కల వారు ఇమ్రాన్‌బీకి సమాచారం అందించారు. దీంతో బాధితులు హుటాహుటిన కదిరికి చేరుకున్నారు. ఇంటిలో ఉన్న రెండున్నర తులం బంగారు, రూ. 50వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చెప్పారు.

ముదిగుబ్బ ఎస్ఐగా వంశీకృష్ణ

ముదిగుబ్బ : ముదిగుబ్బ ఎస్ఐ వంశీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం ట్రాఫిక్‌లో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు చర్యలు తీసుకుంటానని అన్నారు.

పేదలందరికీ ఉచిత వైద్యం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మండల పరిధిలోని కుంట్లపల్లి సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కుంట్లపల్లి సర్పంచి నారప రెడ్డి, చలమకుంట్లపల్లి సర్పంచి రజనీష్ కుమార్ రెడ్డి , కదిరి కుంట్లపల్లి ఎంపీటీసీ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమాన్నిప్రారంభించారు. ప్రత్యేక వైద్య అధికారులు ప్రమీల,పల్మనరీ మెడిసిన్ వినోద్ కుమార్ డాక్టర్. కావ్య రామాంజినేయులు ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అంజినప్ప, పంచాయతీ కార్యదర్శులు మమత, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని జొన్నల కొత్తపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవి, ఎద్దులప్ప, మండల స్పెషల్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఎంపీడీవో విజయలక్ష్మి, డాక్టర్ రాజేంద్ర, వైస్ ఎంపీపీ క్రిష్ణమ్మ వెంకటేశ్వర రెడ్డి, మండల నాయకులు యోగానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి గాండ్లపెంట



పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన

పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చెత్తతో తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు సాంబశివ, స్థానిక నాయకుడు రాజారెడ్డి, పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు అక్కులప్ప మాట్లాడుతూ దాదాపు సంవత్సరం నుంచి పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వేతనాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పంచాయతీ కార్యదర్శి రఫీ పారిశుధ్య కార్మికులకు బెదిరిస్తున్నాడని ఆయన విధులుకే సక్రమంగా హాజరు కాలేదని అన్నారు. స్పందించిన తహశీల్దార్ హమీద్‌బాషా మాట్లాడుతూ ఇఒఆర్‌డితో చర్చించి బకాయి వేతనాలు త్వరలోనే చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు నరసింహులు, ఆంజనేయులు, మస్తానప్ప, గంగులప్ప, బాలకృష్ణ, కదిరప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తచెరువు : శ్రీ సత్య సాయి జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పిఆర్‌టియు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని ఆసంఘం జిల్లా అధ్యక్షులు రజనీకాంత్ రెడ్డి తెలిపారు ఈ మేరకుఉపాధ్యాయులతో సమావేశాన్ని గాంధీనగర్ పాఠశాలలో సోమవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు వేతనాలు ప్రతినెల 1వ తేదీన జమ చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు శాశ్వత హక్కు కల్పించండి

బత్తలపల్లి : రాష్ట్ర ప్రభుత్వం 2003 సంవత్సరానికి ముందు ఆసైన్డ్ భూములు పొందిన రైతులకు శాశ్వత హక్కు. కల్పిస్తోందని ఆ కోవలోనే తమకు శాశ్వత హక్కు కల్పించాలని కోరుతూ పలువురు రైతులు తహశీల్దార్ యుగేశ్వరిదేవికి వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలువురు రైతులతో పాటు వన్ టైం సెటిల్మెంట్ కింద పట్టాలు పొందిన కాలనీవాసులు తహశీల్దారు వినతి పత్రాలు అందజేశారు.

యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏపీ రాష్ట్ర అభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్, సీ డాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఈనెల 13న శుక్రవారం ఉదయం 9:30 గంటలకు జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువత కోసం ఉపాధి కల్పనలో భాగంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాబ్ మేళాలో ప్రసిద్ధి చెందిన 14 కంపెనీలకు చెందిన యాజమాన్య ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 600 దాకా వివిధ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం, ఆర్‌డిఒ భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిపిఒ విజయ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

క్రమశిక్షణతో విధులు నిర్వహిద్దాం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్



గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్

హోంగార్డులు క్రమ శిక్షణతో విధులు నిర్వర్తించి పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని హోంగార్డ్స్ కమాండెంట్ ఎమ్. మహేష్ కుమార్ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా యూనిట్ లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులతో పెరేడ్, దర్బార్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమాండెంట్ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉండాలన్నారు. హోంగార్డుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవేనని అన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యాంగా ఉన్నపుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించడానికి వీలవుతుందన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని బాగా మెరుగుపరుచుకోవడానికి పలు మెళకువలు సూచించారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్ లు రెన్యువల్ అవుతున్నాయా లేదా చూసుకొంటూ ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా హోంగార్డులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి జెడ్ విజయ్ కుమార్, రాజశేఖర్ రెడ్డి, ప్రదీప్ సింగ్, ఎఎస్ఐ శ్రీరాములు, సబ్ డివిజన్ల హోంగార్డుల ఇన్‌ఛార్జి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ రిజిస్ట్రేషన్‌తో భూమిని కాజేశారు'..

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

'మా తల్లి గారి ఆస్తిపై నాకు హక్కు ఉన్నా ఇతరులు లీజు పేరుతో నా ఆస్తిని ఆక్రమించి, అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆ భూమిని నాకు వచ్చేలా' చర్యలు తీసుకోవాలని గాండ్లపెంట మండలం మద్దివారి గొంది గ్రామానికి చెందిన నస్రీన్ బేగం కుమారుడు షవాఫ్ జిల్లా ఎస్పీకి విన్నవించారు. సర్వేనెంబర్ 91 లో 5. 43 ఎకరాలు, మూడు సర్వే నెంబర్లు పైకి ఏడు ఎకరాల భూమిని కదిరి పట్టణానికి చెందిన సాయి దేవానంద్ ఆక్రమించారని, ఆయన తండ్రి దేవానంద్ కూడా తన భూమిని ఆక్రమించారని, వారి నుండి తనకు ప్రాణహాని ఉందని ఎస్పీకి విన్నవించారు. జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుండి 75 పిటీషన్లు స్వీకరించారు. అర్జీదారుల సమస్యను అడిగి తెలుసుకొని, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, దిశా డిఎస్‌పి వరప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయి నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో బైజూస్ అమలు

హిందూపురం : ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో బైజూస్‌ను అమలు చేయాలని ఎంఇఒ - 1, కోర్సు డైరెక్టర్ గంగప్ప సూచించారు. సోమవారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో ఐఎస్బీ టీవీ, బైజూస్‌పై ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్ గంగప్ప మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీకి అనుగుణంగా శిక్షణ పొంది విద్యార్థులకు పాఠశాల స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ -2 ప్రసన్న లక్ష్మి, ఎంజీఎం హెచ్‌ఎం సామ్రాజ్యం, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

లాడ్జిల తనిఖీ

కదిరి అర్బన్ : పట్టణంలోని పలు లాడ్జిలను సిఐ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. సాయి గ్రాండ్, నామా లాడ్జ్, మోహన్ లాల్ చంద్రస్ లాడ్జ్, జొన్న లాడ్జ్ తదితర లాడ్జిలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జిలలో క్రికెట్ బెట్టింగులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించామన్నారు. లాడ్జిల యజమానులను పలు సూచనలు చేశారు. లాడ్జిలో బసచేసే వారి వివరాలను పూర్తిస్థాయిలో సేకరించుకొని వారి గుర్తింపు కార్డులను తీసుకోవాలని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పైపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని, ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని సూచించారు. డ్రైడే ఫ్రైడే పాటించి జ్వరాల బారిన పడకుండ ఉండాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ప్రవీణ్ కుమార్, సిహెచ్ఒ నగేష్, సూపర్ వైజర్ వెంకట రమణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలను పరిష్కరించండి

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని సున్నంపల్లి గ్రామపంచాయతీ మహమ్మదాబాద్ క్రాస్‌లోని బీసీ కాలనీ బుట్టు రామన్న కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల అధ్యక్షులు కుల్లాయప్ప, మండల కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో సిమెంట్ రోడ్డు, డ్రయినేజీలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవటం లేదని విమర్శించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో వరలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బాబు, రమణప్ప తదితరులు పాల్గొన్నారు.


ఉచిత మెడికల్ క్యాంపు

కదిరి టౌన్ : పట్టణంలోని ఆజాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత న్యూరోపతి క్యాంప్ నరాల బలహీనత, అరికాళ్ళ మంటలు వంటి నరాల సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపులో సుమారు 80 మంది వరకు నరాల వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇస్మాయిల్ ఆజాద్, ఫార్మసిస్ట్ అఖియార్, జుబేర్, సిబ్బంది పాల్గొన్నారు.


చంద్రబాబుపై ఆధారాలు లేని కేసులు : టిడిపి



పుట్టపర్తిలో గుండు కొట్టించుకుంటున్న నాయకులు



పెనుకొండలో ర్యాలీలో పాల్గొన్న పార్థసారథి, తదితరులు



మడకశిర నిరసన దీక్షలో మాట్లాడుతున్న గుండుమల

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

చంద్రబాబును అరెస్టు చేసి నేటికీ నెల రోజులు అయిందని ఇప్పటివరకు ఎటువంటి ఆధారాలు ప్రభుత్వం చూపించలేకపోయిందని ఇది కేవలం కక్ష సాధింపు చర్యలేనని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 26 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కర్నాటక నాగేపల్లికి చెందిన రిక్షా కార్మికుడు నాగభూషణ, ఆమడగూరు మండలానికి చెందిన మాజీ సింగల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి దీక్షా శిబిరంలో గుండ్లు కొట్టించుకుని నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సామకోటి ఆదినారాయణ, కొత్తచెరువు శ్రీనివాస చౌదరి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

పెనుకొండ : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం పార్టీ జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి ఆధ్వర్యంలో పెద్దచెరువుకట్ట ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి పెనుకొండ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వరకూ పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రకు సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధులు రొద్దం నరసింహులు, రఘువీరాచౌదరి, నాయకులు సామకోటి ఆదినారాయణ, కురుబ కృష్ణమూర్తి, కేశవయ్య, చిన్న వెంకటరాముడు, బోయ నాగరాజు, సిద్దయ్య, సిద్దలింగప్ప, రవిశంకర్, లక్ష్మినారాయణరెడ్డి, రామలింగ, హుజూర్, జావీద్, రియాజ్, శ్రీనివాసులు, ఆదిశేషు, పోతిరెడ్డి, గాయిత్రి, నాగమణి, చంద్రకాంతమ్మ, బేబీ, అనురాధ, తెలుగు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర : చంద్రబాబు విడుదల అయ్యేంత వరకూ పోరాటం ఆగదని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పట్టణం లోని 18, 19, 20 వార్డుల్లో సామూహిక రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. తిప్పేస్వామి సమక్షంలో పట్టణానికి చెందిన బేగార్లపల్లి మల్లప్ప, హనుమంతరాయ, మారుతి, మంజు తరపున 18 కుటుంబాలు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరగా వారికి తిప్పేస్వామి పసుపు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం 'బాబుతో నేను' నేను కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మనో హర్, రూరల్ కన్వీనర్ లక్ష్మీనారా యణ, రొళ్ల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్లయ్యచౌదరి, నాగరాజు, భక్తర్, మంజునాథ్, సుబ్బరాయుడు, మల్లికార్జున, కృష్ణమూర్తి, కౌన్సిలర్లు ఉమాశంకర్, శ్రీనివాస్, కల్లుమర్రి సర్పంచి నాగరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం ఢిల్లీలో నిరాహార దీక్ష

చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఢిల్లీలో నిరాహార దీక్ష చేపట్టినట్లు కోట్ల రంగనాథ్ తెలిపారు. మండల పరిధిలోని అమిదాలగొంది గ్రామానికి చెందిన రంగనాథ్ సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర రిలే నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు. వికలాంగుడైన రంగనాథ్ చంద్రబాబు కోసం ఢిల్లీలో రిలే నిరాహార దీక్ష చేయడం హర్షించదగ్గ విషయమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి అభినందించారు. బోగార్లపల్లి గ్రామంలోని మహిళలు రంగనాథ్‌కి హారతి ఇచ్చి ఢిల్లీకి సాగనంపారు. కార్యక్రమంలో కన్వీనర్లు మనోహర్, దాసిరెడ్డి, లక్ష్మినారాయణ, రవికుమార్, తిమ్మరాజు, ఉమాశంకర్, హనుమంతగౌడ్, పుల్లయ్యచౌదరి, సన్నీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని స్థానిక మూడు రోడ్ల కూడలి నుండి కదిరికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల రాముడు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఈకార్యక్రమంలో నాయకులు కిషోర్, ఈశ్వరయ్య, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అభిమానులు సంతకాల సేకరణ చేపట్టారు. మండలంలోని మలకవేముల, సానివారిపల్లి పంచాయతీలోని ఏడు గ్రామాల ప్రజల వద్దకు వెళ్లి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ప్రజలతో సంతకాల సేకరించారు. ఈసంతకాలను రాష్ట్రపతికి పంపుతున్నట్లు నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడు గ్రామాల నాయకులు దేవేందర్ రెడ్డి, నాయుడు, కేశప్ప, రమణ, కాంతుడు, రవి, నీలకంఠారెడ్డి, శివయ్య, గంగాద్రి, లోకేష్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని నల్లబోయనపల్లి పంచాయతీ, నల్లబోయనపల్లి, కాటమకుంట,ముద్దనపల్లి గ్రామాల్లో గోనుగుంట్ల అభిమానులు సంతకాల సేకరణ చేపట్టారు. ప్రభుత్వం మీద చర్యలు తీసుకోవాలని సంతకాలు చేయించి రాష్ట్రపతికి పంపుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకులేటి వీరనారప్ప, గంటాపురం ఈశ్వరయ్య, ఈశ్వరరెడ్డి, శేఖర్, రాఘవంపల్లి నరసింహులు, చంద్రశేఖర్, ముసుగు రామచంద్ర, తారక్, కప్పల రాయుడు, కొండప్ప, మోదేపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.